బిరుదాల జనార్దన్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, గణపతినాయుడు

తిరుపతి రూరల్: పద్మావతీపురం వైఎస్‌ఆర్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు బిరుదాల మునికృష్ణారెడ్డి సోదరుడు జనార్దన్‌రెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం ఆయన నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెంట ఆర్సీ పురం మండలం పార్టీ ఇంచార్జ్, పద్మావతిపురం మాజీ సర్పంచ్ గణపతి నాయుడు పాల్గొన్నారు.

సర్పంచ్ తల్లికి ఘన నివాళి

పాకాల: మండలంలోని మేజర్ పంచాయతీ పాకాల గ్రామ సర్పంచ్ ఎస్.కస్తూరి తల్లి ఎస్.జయలక్ష్మి ప్రథమ వర్ధంతికి తుడా చైర్మన్, వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరయ్యారు. జయలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లి పంచాయతీ రేకలచేను గ్రామానికి చెందిన కొర్లగుంట వెంకటరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం వారి గ్రామానికి చేరుకుని వెంకటరెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిరూపించు.. నీకే రాసిస్తా

- భూకుంభకోణాన్ని నిరూపించు
- మీ నాన్న మంత్రిగా ఉన్నప్పుడు వీరప్పన్ అవతారమెత్తింది నువ్వుకాదా?
- నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోబోము
- బొజ్జల సుధీర్‌ను నిలదీసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'మీ నాన్న మంత్రిగా ఉన్నప్పుడు ఎన్ని కుంభకోణాలు చేశావో అందరికీ తెలుసు. వీరప్పన్ అవతారమెత్తి ఎక్కడెక్కడ ఎర్రచందనం విక్రయించినావో ఊరందూరులో ఎవరినడిగినా చెబుతారు. నీ చిట్టా అంతా మా వద్ద ఉంది. ఏడాదిలో ఒకటి రెండు సార్లు వచ్చి లేనిపోని నిందారోపణలు చేయడం అలవాటుగా మార్చుకున్నావు. గుడ్డకాల్చి ముఖానేస్తానంటే ఇక్కడెవ్వరూ ఊరుకోరు. బొజ్జల సుధీరా..? నీ బాగోతాన్ని బయటపెడతా..?. నువ్వు రూ.వెయ్యి కోట్లు భూకుంభకోణమని ఆరోపించావు. ఏవేవో సర్వే నంబర్లు ఇచ్చి ప్రెస్‌మీట్లో చెప్పావు. ఆ సర్వే నంబర్లలో ఒక్క సెంటు నాపై ఉన్నా నీకే రాసిస్తా. రూ.5 కోట్లు ఇవ్వు చాలు' అంటూ టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డిపై స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. నువ్వు బొజ్జల కుటుంబానికి చెందినవాడివే అయితే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 30 ఏళ్లలో చేయని అభివృద్ధిని తాను నాలుగున్నరేళ్లలోనే చేసి చూపించానని చెప్పారు. మీ తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో ఆయనను అడ్డం పెట్టుకుని వీరప్పన్ అవతారం ఎత్తి ఎర్రచందనం అమ్ముకున్నట్టు ఆరోపించారు. ఇసుక దాహానికి ఏర్పేడు మండలంలో 16 మంది రైతులు మరణించారని చెప్పారు. ఐసర్, ఐఐటీ, ఎయిర్‌పోర్టు భూముల్లో టీడీపీ అక్రమాలపై ఎంక్వైరీ వేస్తున్నామని, చంద్రబాబు లాగా బొజ్జల సుధీర్‌రెడ్డి కూడా జైలుకెళ్లడం ఖాయమన్నారు. తాను ప్రజల్లో ఉండే మనిషినని, ఎన్నికల సమయంలో అమ్మను, భార్యను తీసుకువచ్చి డ్రామాలు ఆడడం లేదన్నారు.

ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వండి

తిరుపతి అర్బన్: ప్రతి రైతు తమ పరిధిలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్ రావు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్, నవంబర్ మాసాల్లో వర్షాలు తక్కువగా ఉండడంతో తెలుగుగంగ నీటిని ఇవ్వడం లేదని, ఈ క్రమంలో వరికి బదులు ఆరుతడి పంటలపై రైతులు మొగ్గు చూపాలని సూచించారు. తెలుగుగంగ ప్రాజెక్టు గూడూరు డివిజన్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కండలేరు జలాశయంలో నీటిమట్టం తక్కువగా ఉండడం వల్ల ఈ రబీ సీజన్‌కు సాగునీరు ఇవ్వడం లేదని చెప్పారు. సీనియర్ శాస్త్రవేత్త కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆరుతడి పంటలకు సంబంధించి నువ్వులు, పెసలు, మినుములు, వేరుశనగ తదితర పంటలను డిసెంబర్, జనవరి వరకు సాగుచేసుకోవచ్చన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్, సలహా మండలి కమిటీ సభ్యులు గంగాధర్, ఉద్యానశాఖ అధికారి సునీల్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో స్పెషల్ పే క్లినిక్ సేవలు

తిరుపతి తుడా: సిమ్స్ ఆస్పత్రిలో సోమవారం నుంచి స్పెషల్ పే క్లినిక్ సేవలను ప్రారంభించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం తెలిపారు. ఎంపిక చేసిన విభాగాల్లో సోమవారం నుంచి స్పెషల్ పే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. స్విమ్స్‌లో ఓపీ సేవలు పెరుగుతున్న నేపథ్యంలో ఈవినింగ్ క్లినిక్ సేవలను అందుబాటులోకి తేవాలని టీటీడీ యాజమాన్యం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెడికల్ రికార్డ్ సెక్షన్ కౌంటర్ నం.6లో ఓపీలు పొందవచ్చన్నారు. అలాగే ఉదయం 7 నుంచి 8 గంటల వరకు 0877-227777 ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చు ఆయన సూచించారు.

ఆటోను ఢీకొన్న కారు



మృతి చెందిన మునికృష్ణయ్య

చంద్రగిరి: మొక్కజొన్న లోడుతో ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటన మండల పరిధిలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసుల వివరాల మేరకు.. చంద్రగిరి వికలాంగుల కాలనీకి చెందిన మునికృష్ణయ్య(60) మొక్కజొన్నను ఆటోలో వేసుకుని తిరుపతికి పయనమయ్యారు. తొండవాడ ఫ్లైఓవర్‌పై వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో మునికృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవరు చిరంజీవి, కృష్ణమ్మ, ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఏసీ, ఫ్రిడ్జ్‌ల సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ పురుషులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉపాధి, ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి 30 రోజుల పాటు పురుషులకు ఏసీ, ఫ్రిడ్జ్‌ల రిపేరు, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. తెల్లరేషన్ కార్డు కలిగి తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెంది 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం 10వ తరగతి చదువుకున్న నిరుద్యోగ పురుషులు అర్హులని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను–పోను ఒక్కసారి బస్సు చార్జీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేమని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో నేరుగా సంస్థ వద్దకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఒక్కో బ్యాచ్‌కు 25 నుంచి 30 మందిని మాత్రమే చేర్చుకుంటామని, ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకానగర్, కొత్తపేట, చంద్రగిరి. ఫోన్ నం.79896 80587, 94949 51289, 63017 17672లలో సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

తిరుపతి(అలిపిరి): తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన 'డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ అడ్వాన్సెస్ అండ్ ఫ్యూచర్ ట్రెండ్స్' అనే అంశంపై అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మా స్యూటికల్స్‌పై ముఖ్యఅతిథిగా హాజరైన రీజెంట్స్ ప్రొఫెసర్ డాక్టర్ డీ.సాంబరెడ్డి మాట్లాడారు. అనంతరం అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప చతుర్వేదులు, వర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, వర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

పక్కాగా ప్లాస్టిక్ నియంత్రణ

- పట్టణాల్లో ఎయిర్ పొల్యూషన్ హాట్ స్పాట్ల వద్ద పచ్చదనం పెంచాలి
- తిరుపతి నగరపాలక సంస్థ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ భేష్
- ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ సమీర్‌శర్మ



మాట్లాడుతున్న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ సమీర్ శర్మ

తిరుపతి సిటీ: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నియంత్రణ పక్కాగా అమలు చేయాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్, మాజీ సీఎస్ సమీర్‌శర్మ అధికారులను ఆదేశించారు. తిరుపతి శ్రీపద్మావతి అతిథి గృహంలో శనివారం ఆయన జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమావేశమై ప్లాస్టిక్ నియంత్రణపై పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ ఉత్పత్తి చేసే పరిశ్రమలు తమ వస్తువుల వాడకం అనంతరం రీసైకిల్ కోసం తిరిగి సేకరణ బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్స్ రెస్పాన్స్‌బిలిటీ(ఈపీఆర్)ను తప్పక అమలు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే భారీ అపరాధ రుసుములు సంబంధిత పరిశ్రమలే చెల్లించేలా మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపైన, గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వేస్టేజ్, బాటిల్స్ కనపడరాదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 165 ప్రభుత్వ ఆస్పత్రులు, 834 ప్రవేట్ ఆస్పత్రులు, 35 పశువైద్యశాలలు మొత్తం 1,035కు పైగా ఉన్నాయని, అన్ని ఆస్పత్రుల్లో 2016 ప్రకారం బయోమెడికల్ వేస్ట్ నిబంధనలు తప్పనిసరిగా అమలు కావాలని ఆదేశించారు. అనుమతి పొందిన బయోవేస్ట్ రీ సైకిల్ కంపెనీలు సేకరణ సమయంలో తప్పనిసరిగా క్యూఆర్ కోడ్, బ్లూటూత్ విధానం అమలు చేస్తూ రోజువారి నమోదు చేయాలని చెప్పారు. తిరుపతి నగరపాలక వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ బాగుందని, ప్రెసిడెన్సియల్ అవార్డు అందుకోవడం అభినదనీయమన్నారు. పొల్యూషన్ హాట్‌స్పాట్లలోనూ, కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద ఏఈకాం సంస్థ ప్రతిపాదనలు తీసుకుని పచ్చదనం పెంచాలన్నారు. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, స్విగ్గీ, జుమాటో వంటి సంస్థలు సరఫరా చేసే ప్లాస్టిక్ వస్తువులు, పాల పంపిణీదారులు సరఫారా చేసే ప్యాకెట్ వేస్టేజ్‌లను సంబంధిత కంపెనీలే సేకరణ చేయాలని చట్టం చెబుతోందన్నారు. ఎంఎన్‌సీ కంపెనీలు రీ సైక్లింగ్ వివరాలను తెలియజేయాలని సూచించారు. వాహనాల విషయంలో బై బ్యాక్ విధానంతో బ్యాటరీల సేకరణ, ఈ–వేస్ట్ ఎలక్ట్రానిక్ సంస్థల వస్తువులు, విడిభాగాల సేకరణ, రీ సైక్లింగ్ వివరాలు తప్పక తెలయజేయాలన్నారు. సమావేశంలో కర్నూల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జాయింట్ కమిషనర్ రమేష్, తిరుపతి పీసీబీ ఈఈ నరేంద్ర, తిరుపతి నగరపాలక సంస్థ డీసీ చంద్రమౌళీశ్వరరెడ్డి, జిల్లాలోని ఆస్పత్రుల ప్రతినిధు లు, ప్లాస్టిక్ ఉత్పత్తిదారులు, రీ సైక్లింగ్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 25 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. సన్నీ ఓపోటిక్ అనే ఎంఎన్‌సీ కంపెనీ చేపట్టిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాల్లోని పలువురు విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. సుమారు ఏడాదికి రూ.2.4లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

రామకుప్పం: మండలంలోని రాజనాలబండ అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. కవ్వంపల్లెకు చెందిన సోమశేఖర్‌కు కర్ణాటకలోని బిల్లేరిపల్లెకు చెందిన కాంతమ్మ కుమార్తె సౌమ్యకు ఆరు నెలల క్రితం వివాహం నిశ్చయమైంది. అయితే సౌమ్య మైనర్ కావడంతో మేజర్ అయిన తర్వాత పెళ్లి చేయాలని ఇరు కుటుంబాలవారు నిర్ణయించారు. అప్పటి నుంచి సోమశేఖర్ బిల్లేరిపల్లెకు తరచూ రాకపోకలు సాగించేవాడు. కాబోయే భార్య కుటుంబీకులతో చనువుగా ఉండేవాడు. ఈ మేరకు వారు ఇల్లు నిర్మించుకుంటుంటే ఆర్థికసాయం కూడా అందించాడు. ఈ క్రమంలో శుక్రవారం బిల్లేరిపల్లెకు వెళ్లిన సోమశేఖర్ రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. శనివారం ఉదయం ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతదేహంగా కనిపించాడు. దీనిపై మృతుడి తండ్రి ముని వెంకటప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సౌమ్య తమ కుమారుడితో పెళ్లికి నిరాకరించడం వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.



అభివృద్ధికి రోల్ మోడల్‌గా ఆంధ్ర రాష్ట్రం

- ఎమ్మెల్యే సహకారంతోనే మండలానికి రూ.70 కోట్లు
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న తుడా చైర్మన్, వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆంధ్రరాష్ట్రం వైపు చూస్తున్నాయని, అభివృద్ధిలో ఏపీ రోల్ మోడల్‌గా ఉందని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తుడా చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, జగనన్న సంక్షేమానికి పెద్ద పీట వేశారని తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో తుడా నిధులు సుమారు రూ.70 కోట్లు అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. మండలంలోని ప్రతీ పంచాయతీలో రూ.2 నుంచి 3 కోట్ల వరకు నిధులను కేటాయించి అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు వివరించారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని ప్రతీ ఇల్లు తన కుటుంబమే అనుకుని ఎక్కడ పెళ్లి జరిగినా కానుకను అందజేస్తున్నారని, ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో ఎమ్మెల్యే తన సొంత నిధులతో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక, ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారని తెలిపారు. చివరగా సింగిల్ విండో చైర్మన్ మునీశ్వర్‌రెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలోని రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం, పార్కు అభివృద్ధి, చిన్నపిల్లల ఆస్పత్రి వంటి పలు అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలను మోహిత్‌రెడ్డికి విన్నవించారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, వైస్ ఎంపీపీ నాగూర్‌బీ, ఏఎంసీ చైర్మన్ లింగయ్య, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ మాలతి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పార్కులో బిగ్ స్క్రీన్

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం పార్క్‌లో ప్రపంచ కప్ ఫైనల్ పోటీలను వీక్షించేందుకు బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ హరిత తెలిపారు. ప్రకాశం పార్కులో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం రాత్రి కమిషనర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం 1 గంట నుంచి మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కమిషనర్ వెంట డీఈఈ విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదాలు






సర్పంచ్ రామచంద్రారెడ్డితో కలసి భక్తులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మా వతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆఖరి ఘట్టమైన పంచమి తీర్థంను పురస్కరించుకుని స్థానిక సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి నిరంతరాయంగా 25వేల మందికి పైగా అల్పాహారం, భోజనం పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మెహిత్ రెడ్డి పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. శుక్రవారం రాత్రి నుంచే వంటావార్పు కార్యక్రమం మొదలు పెట్టారు శుక్రవారం రాత్రి 7వేల మందికి అల్పాహారం, శనివారం ఉదయం 10వేల మందికి అల్పాహారం, మధ్యాహ్నం 25 వేల మందికి భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీపరాశరేశ్వర ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, యోగానందరెడ్డి, మునీంద్ర రాయల్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాల పంపిణీ

చంద్రగిరి(తిరుచానూరు): పంచమీతీర్థం పురస్కరించుకుని శనివారం తిరుచానూరుకు తరలివచ్చిన లక్షలాది మంది భక్తులకు టీటీడీ అన్నదానం క్యాంటీన్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. భక్తుల సౌకర్యార్థం తోళపగార్డెన్, జెడ్పీ ఉన్నత పాఠశాల, పసుపు మండపం సమీపంలో తాత్కాలిక అన్నదాన వితరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చక్రస్నానానికి వచ్చే భక్తులకు పసుపు మండపం వద్ద 30 వేల మందికి, పుష్కరిణిలోకి వెళ్లేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు 20వేల మందికి, మొత్తం 50వేల మందికి అల్పాహారం అందించారు. చక్రస్నానం అనంతరం మూడు ప్రాంతాల్లో 60వేల మంది భక్తులకు మూడు రకాల అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

భారత్ విజయం కోసం వినూత్న ప్రదర్శన



ప్రపంచ కప్ నమూనా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్: ఆదివారం జరుగనున్న వన్‌డే క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ పోటీలో భారత్ క్రికెట్ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కరకంబాడి స్ప్రింగ్ పబ్లిక్ విద్యార్థులు శనివారం వినూత్న ప్రదర్శనతో విజయ సంకేతాన్ని అందించారు. పాఠశాలలో విద్యార్థులు ప్రపంచకప్ నమూనాగా నిలబడి భారత క్రికెట్ జట్టుకు తమ మద్దతు తెలిపారు. పాఠశాల అధినేత కేఎస్.వాసు, పాఠశాల ప్రిన్సిపల్ కేఆర్.అనురాధ గోపాల్, హెచ్ఎం ప్రమీల కృష్ణన్, ఏవో చంద్రశేఖర్, పీఆర్‌వో సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ఆదరించండి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: భారతీయ సంస్కృతికి, సాంప్రదాయానికి దర్పణం పట్టే హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలను ప్రజలందరూ ఆదరించి మరింత ప్రోత్సహించాలని మేయర్ డాక్టర్ శిరీష పిలుపు నిచ్చారు. జీవన జ్యోతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఇస్కాన్ మందిరం వద్దనున్న మైదానంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను మేయర్ డాక్టర్ శిరీష శనివారం రాత్రి ప్రారంభించారు. ఇస్కాన్ మైదానంలో ఏర్పాటు చేసిన ఈ చేనేత, హస్తకళా ప్రదర్శన ఈ నెల 18 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

రిలయన్స్ మార్ట్‌ని ప్రారంభించిన మోహిత్‌రెడ్డి



రిలయన్స్‌మార్ట్‌ని ప్రారంభిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: ఆర్టీసీ బస్టాండ్‌కి సమీపంలోని మురళీ కాంప్లెక్స్ ఆవరణలో నూతనంగా నిర్మించిన రిలయన్స్ మార్ట్‌ని శనివారం తుడా చైర్మన్, వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, నంగా బాబురెడ్డి, మురళీమనోహర్ చౌదరి, జనార్దన్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, రమేష్, గుండ్లూరి సురేష్, ఉమాపతి పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా: సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ హరిత శనివారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ పరిధిలోని 50 వార్డులలో 6 వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తుదారులు ఎస్ఎస్‌సీ అర్హత కలిగి తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో నివాసితులై ఉండాలని పేర్కొన్నారు. వలంటీర్ల పోస్టుల భర్తీలో 50శాతం మహిళలకు కేటాయించామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 26 వ తేదీ వరకు దరఖాస్తును ఆన్ లైన్‌లో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

ఆత్మతృప్తితో విధులు నిర్వర్తించాం



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి

తిరుపతి మంగళం: ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడేందుకు అటవీశాఖలో ఆత్మతృప్తితో విధులు నిర్వర్తించామని, ముందు తరాలకు స్ఫూర్తిగా నిలిచామని ఏపీ మాజీ అటవీదళాధిపతి (పీసీసీఎఫ్), రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పి.మల్లికార్జునరావు అన్నారు. తిరుపతిలోని కేంద్రీయ ఎర్రచందనం గోదాముల ప్రాంగణంలో శనివారం ఏపీ విశ్రాంత అటవీ ఉద్యోగుల సంఘం తిరుపతి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకమాస ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ నాగేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగులు శ్రీనివాసశాస్త్రి, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, కృష్ణయ్య, రమణ, స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోదబాయి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ ఎం.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.